## బాలసాహిత:

# సీసాలో తమాషా

చావలి సాంబశివరావు

పూర్వం వెంకన్న అనే కట్టెలు కొట్టేవాడొకడు ఉండేవాడు. వాడు చాల బీదవాడు. అందుచేత అతడు ప్రతిరోజూ ప్రొద్దుటినుండి చీకటి పడేవరకూ ఎంతో కష్టపడి పనిచేసేవాడు. ఆ విధంగా శ్రమ పడగా కొన్నాళ్ళకి అతడు కొంత ధనాన్ని కూడబెట్టగలిగాడు.

ఒకరోజున అతడు తన కొడుకుతో ఇట్లా అన్నాడు: "ఎన్నాళ్ళ నుంచో చెమటోడ్చి కష్టించిన ఫలితంగా ఈమాత్రం ధనం సంపాదించగల్గాను. నువ్వు నాకు ఒక్కగాను ఒక్క బిడ్డవు. ఈ డబ్బు నీ చదువుకి ఖర్చు పెట్టాలని నా ఉద్దేశ్యం. ఈ ద్రవ్యంతో నీవు పెద్ద చదువులు చదివి గొప్పవాడివై ముసలితనంలో నాకు ఆసరాగా ఉండి నన్ను ఉద్ధరిస్తావని నా ఆశ. ఇందుకు నువ్వు ఏమంటావు?"

"సరే, అట్లాగే చదువుతాను" అని తన అంగీకారాన్ని తెలియజేసేడు, వెంకన్న కొడుకు నాగరాజు.

తండ్రి కోర్కె ప్రకారం నాగరాజు ఒక పేరొందిన స్కూల్లో ప్రవేశించాడు. తండ్రి తనకోసం పడే కష్టాన్ని కళ్ళార చూచిన నాగరాజు, శ్రద్ధగా చదువ నారంభించాడు. అతడు ఎంతో పొదుపుగా డబ్బు ఖర్చుపెడుతున్నాడు. అయినా కొన్నాళ్ళకి తన తండ్రి సంపాదించిన కాస్త డబ్బూ అయిపోయింది. స్కూల్లో జీతం కట్టడానికి, పుస్తకాలు కొనుక్కొనేందుకు చేతిలో చిల్లిగవ్వ లేదు. అందుచేత నాగరాజు యింటికి వచ్చేశాడు.

"ఏం నాయనా, అనుకోకుండా యిలా వచ్చావు? యిప్పుడేం శలవులు లేవుగా? అలా వున్నావేం?" అంటూ ప్రశ్నలవర్షం కురిపించాడు నాగరాజు తండ్రి, వెంకన్న.

నాగరాజు తండ్రికి తను వచ్చినందుకు కారణం చెప్పాడు.

"అయ్యో, నా దగ్గర ఏమీ లేదే! ఏం చేయను?...ఈ కరువు రోజుల్లో నా సంపాదన తిండికే చాలటం లేదు; ఇంకా కొంత మిగిల్చి నీ చదువుకు ఏం పంపగలను?......" అన్నాడు వెంకన్న విచారంగా.

"పోనీలే నాన్నా! విచారించకు-నా చదువు ఇంతటితో ఆగిపోవటం భగవంతునికి యిష్టమైతే, మన మేం చేస్తాం? ఇదీ మన మంచికే వచ్చిందేమో! నువ్వు మనస్సులో బాధ పడకు" అన్నాడు నాగరాజు తండ్రితో.

తర్వాత వెంకన్న అడవిలో కట్టెలు కొట్టి, నాలుగు డబ్బులు సంపాదించటానికి బయలుదేరాడు.

"నేను కూడా నీతో వస్తా నాన్నా. నీకు సహాయం చేస్తాను" అన్నాడు నాగరాజు.

"నువ్వు వద్దులే నాయనా-కండలు కరిగేట్టుగా నువ్వక్కడ పని చేయలేవు; నీకు అలవాటులేదు. అదీగాక నాదగ్గిర ఒక్క గొడ్డలి మాత్రమే ఉంది. ఇంకోటి కొందామంటే డబ్బు లేదు" అన్నాడు వెంకన్న.

"నేను పనిచేయగలను నాన్నా. గొడ్డలి లేకపోతే ప్రక్కయింటివారి దగ్గర ఎరువు తీసుకురా" అన్నాడు నాగరాజు.

అందుమీదట వెంకన్న ప్రక్కింటివారి దగ్గర్నుంచి ఒక గొడ్డలి తెచ్చాడు, కొడుకుకోసం.

* * *

మర్నాడు తెల్లవారుజామునే నిద్రలేచి, తండ్రీ కొడుకు లిద్దరూ కలిసి అడవికి వెళ్ళారు.

అడవిలో నాగరాజు కట్టెలు కొట్టడంలో తండ్రికి చాలా సాయపడ్డాడు. అతడు చాలా నేర్పుగాను చురుకుగాను పనిచేశాడు.

మధ్యాహ్నమయ్యేసరికి వెంకన్న "ఇక పని చాలించరా అబ్బాయి! భోంచేసి, కాస్సేపు విశ్రమించినతర్వాత, మళ్ళీ గొడ్డలి ఎత్తుకుందాం" అన్నాడు. తండ్రీ కొడుకు లిద్దరూ మూటకట్టుకొచ్చిన అన్నం తిన్నారు.

"నాన్నా, నువ్విక్కడే పడుకో. నేను కాస్త అట్లా పోయి, పిట్టల గూళ్లు ఏమైనా దొరుకుతాయేమో

చూసివస్తాను. నే నింకా అలసిపోలేదులే!" అన్నాడు నాగరాజు తండ్రితో.

"రెండు మెతుకులు తిన్నావో లేదో అప్పుడే ఎక్కడికి పోతావురా? కూర్చో. పిచ్చికగూళ్ళకోసం, కాకిగూళ్ళకోసం తిరిగి తిరిగి అలసిపోయి వస్తే, నువ్వసలు గొడ్డలి పట్టుకోగలవా? చెప్పు - నా మాట విని కాస్సేపు మెదలకుండా కూర్చో" అని గదమాయించాడు వెంకన్న కొడుకుని.

కాని నాగరాజు తండ్రి మాట లక్ష్యపెట్టలేదు. ఈల వేసుకుంటో, ఏమన్నా పిట్టలగూళ్లు దొరుకుతాయేమోనని, చెట్లఆకుల గుబురుల్లో తొంగిచూస్తో, ముందుకు సాగిపోయాడు. ఇటూ అటూ అతడు చాల సేపు తిరిగాడు. కాని ఎక్కడా ఒక్క గూడు అయినా కనపడలేదు.

పట్టుదలతో అతడు యింకా పిట్టలగూళ్ళకోసం వెదుకుతూ, ఒక మర్రిచెట్టువద్దకి వచ్చాడు. "ఈ చెట్టుమీద చాలా గూళ్ళు ఉండవచ్చు" అనుకుంటూ నాగరాజు తల పైకెత్తి చెట్టుకేసి ఆట్టే చూడసాగాడు. ఇంతలో అతనికొక వింత స్వరం విన్పించినట్లయింది. నాగరాజు చెవి ఒగ్గి సరిగా విన్నాడు. నూతిలో గొంతుకమాదిరిగా ఏదో అరుపు—"నన్ను విడిపించు! నన్ను విడిపించు!" అని.

నాగరాజు ఆశ్చర్యపడుతూ, నాలుగువైపులా చూశాడు, ఎవరా అరిచేదని. కాని ఎవ్వరూ కన్పడలేదు. శబ్దం భూమిమీదనుంచి వస్తున్నట్టు గ్రహించాడతడు. అందుచేత, "నువ్వెక్కడున్నావ్?" అని ప్రశ్నించాడు.

"ఇదిగో. ఇక్కడ-ఈ మర్రిచెట్టు తొర్రలో యిరుక్కుని వున్నాను. నన్ను విడిపించు! నన్ను విడిపించు!" అని సమాధానమిచ్చింది ఆ గొంతుక.

చీకటిగా వున్న మర్రి చెట్టు తొర్రలో పరీక్షగా చూడసాగాడు నాగరాజు. చివరికి అతనికొక గాజు సీసా కన్పించింది.

సీసాని వెలుతురులోకి తీసుకు వచ్చి నాగరాజు పరిశీలనగా చూశాడు. కప్పలాగా ఏదో సీసాలో క్రిందికీ పైకీ ఎగిరిపడుతోంది—"నన్ను విడిపించు! నన్ను విడిపించు!" అని అరుస్తో.

ఏదైనా కీడు సంభవిస్తుందేమోనని ఆలోచించకుండా, నాగరాజు సీసామూత తెరిచాడు.

వెంటనే సీసాలోని పదార్థం బయటికి ఉరికి, పెరిగి పెరిగి పెద్దదై, కన్నుమూసి తెరిచేసరికల్లా, నాగరాజు ఎదుట భయంకరాకారంతో, ఒక పెద్ద రాక్షసుడికిమల్లె ప్రత్యక్షమైంది. అది తప్పకుండా దయ్యమై ఉంటుందని ఊహించాడు నాగరాజు.

ఇంతలో ఆ భయంకరాకారం గర్జించింది, "ఈ సీసాలోనుంచి నన్ను తప్పించినందుకుగాను, నేను నీకిచ్చే ప్రతిఫలం ఏమిటో నీకు తెలుసా?" అని.

"తెలియదు," ధైర్యంగా భయపడకుండా జవాబిచ్చాడు నాగరాజు; "నా కెట్లా తెలుస్తుంది?"

"సరే, నేనే చెపుతాను; నేను నిన్ను చంపెయ్యాలి" అన్నది దయ్యం కఠినంగా.

"ఆ మాట నువ్వు నాకు మొట్టమొదట చెప్పాల్సింది" అన్నాడు నాగరాజు.

"ఇన్నాళ్లనుంచి నన్ను ఈ సీసాలో ఎవరన్నా దయ తలిచి మూసివుంచా రనుకుంటున్నావా? లేదు; అది నాకు శిక్ష. నేనొక దేవదూతను. నన్ను విడిపించినవాడి గొంతుక నేను నులిమెయ్యాల్సిందే!" అంది దయ్యం.

"శాంతించు! శాంతించు!

"నువ్వు నన్ను చంపుతానంటున్నావ్, బాగానే ఉంది కాని, నాకొక చిన్న సందేహం కలిగింది—ఇంత పెద్ద ఆకారంగల్గిన నీవు అంత చిన్న సీసాలో ఎట్లా యిమిడి వున్నావో నాకు బోధపడడంలేదు; అసలు నువ్వు నిజంగా దయ్యానివేనా? అని నా అనుమానం. కాబట్టి నువ్వు ఆ సీసాలోకి పోవటం కళ్లారా చూస్తే, నేను నీ మాటలు నమ్ముతాను. అప్పుడు నువ్వు నీ యిష్టప్రకారం నన్ను ఏమైనా చెయ్యి" అని సమయస్ఫూర్తిగా అన్నాడు నాగరాజు.

"అదెంత పని! చాలా తేలిక!" అని గర్వంగా అంటూ ఆ దయ్యం చాలా సన్నగా మారిపోయి మళ్లీ సీసాలోకి దూరిపోయింది. దయ్యం పూర్తిగా సీసాలోకి దూరిందో లేదో, వెంటనే నాగరాజు సీసాకి బిరడా పెట్టేసి, దాన్ని తిరిగి మర్రిచెట్టు తొర్రలోకి విసిరేశాడు.

నాగరాజు మళ్లీ తండ్రివద్దకు పోదామనుకుంటూండగా, దయ్యం మళ్ళా దీనంగా అరవసాగింది—"నన్ను విడిపించు! నన్ను విడిపించు!" అని.

"ఊహూఁ! నేను విడిపించను! పాపం గదా అని విడిపిస్తే, నన్ను

## ★ సీసాలో తమాషా ★

చంపటానికి ప్రయత్నిస్తావా? నిన్ను ఇంకోసారి నేను విడిపించను నువ్వు ఆ సీసాలోనే చావు!" అన్నాడు నాగరాజు కసిగా.

"నన్ను గనక నువ్వు విడిపిస్తే, నీ జీవితమంతా సుఖంగా గడిచిపోయేట్టు చేస్తాను" అన్నది దయ్యం.

"నేను నిన్ను నమ్మను. ఇంతకు ముందు చేసినట్లే, నువ్వు నన్ను మోసపుచ్చుతావు" అన్నాడు నాగరాజు.

"తాళ్లదగ్గరకొచ్చిన సిరిని తన్నుకుంటున్నావు. నేను నీకేమీ అపకారం చేయను; ఎంతో మేలు చేకూరుస్తాను" అంది దయ్యం.

"సరే, ధైర్యం చేసి చూస్తాను. బహుశా ఈ దఫా దయ్యం తన మాట నిలబెట్టుకోవచ్చు. నాకేమీ అపకారం చేయకపోవచ్చు" అనుకున్నాడు నాగరాజు తనలో.

అలా అనుకుని, అతడు మళ్లీ సీసా మూత తీశాడు. అదివరకటి వలెనే దయ్యం బయటికి ఉరికింది. తన ఆకారం పెంచి పెంచి ఒక పెద్ద రాక్షసుడికిమల్లె నిల్చుంది.

"ఇదిగో, ఇప్పుడు నీ బహుమతి అందుకో!" అంటూ దయ్యం నాగరాజుకి ఏదో వనమూలికవంటి వస్తువు అందించింది.

"ఏదైనా కురుపుకి ఈ మూలిక కొన అంటించావంటే, ఆ కురుపు తక్షణమే నయమౌతుంది; దీని రెండో కొనతో నీవు ఉక్కును గాని, ఇనుమును గాని రుద్దావంటే, అవి వెండిగా మారిపోతాయి" అని చెప్పింది.

"సరే, ఈ మూలిక మహిమ ఏమిటో చూస్తాను!" అంటూ నాగరాజు ఒకచెట్టువద్దకి పోయి, గొడ్డలితో దానిబెరడు కొద్దిగా ఊడగొట్టాడు; బెరడు ఊడిన భాగాన్ని మూలికతో తాకాడు; వెంటనే చెట్టుకి తగిలినగాయం మానిపోయింది.

"భేష్! బాగుంది. మనం యిక విడిపోవచ్చు" అన్నాడు నాగరాజు.

తనను విడిపించినందుకుగాను, దయ్యం నాగరాజుకు తన కృతజ్ఞత తెల్పుకొంది. తనకి మంచి బహుమతియిచ్చినందుకుగాను, నాగరాజ దయ్యానికి తన కృతజ్ఞత తెల్పాడు.

తర్వాత అతడు తిన్నగా తండ్రి వద్దకి వెళ్ళాడు.

"ఇందాకట్నుంచీ ఎక్కడ తిరుగుతున్నావ్?" అని అడిగాడు తండ్రి. నాగరాజు మాట్లాడలేదు.

"నీ పనిసంగతే మరచిపోయావే! ఇలాంటి పనులు నువ్వు చేయలేవని నేను ముందే చెప్పాను" అన్నాడు తండ్రి కోపంగా.

"ఇంతవరకు చేయవలసిన పని అంతా నిమిషంలో చేసేస్తా నాన్నా! నువ్వు ఏమీ కంగారుపడకు" అని సమాధానమిచ్చాడు, నాగరాజు.

"ఆ చేస్తావ్ — చేయకేం!" అన్నాడు తండ్రి హేళనగా.

"ఇదిగో చూడు నాన్నా, ఆ చెట్టుని ఒక్క దెబ్బలో పడగొడతాను" అంటూ నాగరాజు గొడ్డలిని మూలికతో రుద్దాడు; గొడ్డలితో బలంగా చెట్టుమీద కొట్టాడు.


అమ్మకానికి సిద్ధముగానున్నది

శ్రీ పిడపర్తి కృష్ణమూర్తిశాస్త్రి సిద్ధాంతిగారిచే గుణింపబడిన

**ఆంధ్రపత్రిక**

**శ్రీ దుర్ముఖినామ సంవత్సర**

**పంచాంగం**

ఈ సంవత్సరం పంచాంగంలో చాంద్రమాన, దృక్సిద్ధాంతాల ప్రకారం రెండు పద్ధతుల తిథి, నక్షత్రాదులు, గోచారఫలములు, దశాభుక్తులు ఇత్యాది అనేక ముఖ్యమైన విషయములు వేర్వేరుగా చూపబడినవి.

| | | | |
|---|---|---|---|
| 64 పుటలు | క్వార్టర్ డెమ్మీసైజు. | వెల ప్రతి 1-కి | 0-3-0 |
| " | " | " 100-కి | 16-8-0 |
| " | " | " 1000-కి | 150-0-0 |

1000 కాపీలు ఒకే దఫా కొనువారి చిరునామా ముఖపత్రమున ముద్రించబడును.

రైలు ఖర్చులు మినహా.

మేనేజరు, ఆంధ్రపత్రిక, మద్రాసు-1.

కాని, గొడ్డలి 'వెండి'గా మారిపోవటంచే, దాని మొన కాస్తా మొక్కపోయింది.

"అరెరె, చూశావా నాన్నా, నువ్వు నాకు ఎటువంటి గొడ్డలి యిచ్చావో; దాని కసలు పదును లేనేలేదు" అన్నాడు నాగరాజు.

తండ్రి భయపడ్డాడు. "హారి, ఎంత పని చేశావురా? ఆ గొడ్డలి మనది కూడా కాదు; ప్రక్కింట్లో ఎరువు తెచ్చాను. దాన్ని కాస్తా నువ్వు చెడగొట్టావు కాబట్టి, యిప్పుడు నేను వాళ్లకి డబ్బు ముదరా యివ్వాలి. ఇప్పుడేం చేయాలో నాకు తోచటం లేదు" అన్నాడు.

"కోప్పడకు నాన్నా. ఆ గొడ్డలి ఖరీదు నేను వాళ్లకి త్వరలో యిచ్చేస్తాను" అన్నాడు నాగరాజు.

"నేను యిస్తే తప్ప, నీదగ్గిర దమ్మిడీ ఉండదే; అటువంటిది నువ్వు వాళ్లకి ముదరా ఎట్లా ఇవ్వగలవురా?" అని తండ్రి, తన ధోరణిలో పడి, కట్టెలు కొట్టసాగాడు.

"నాన్నా, నేనిక పని చేయలేను యింటికి పోదాంరా" అన్నాడు నాగరాజు, నెమ్మదిగా.

"ఏమన్నావ్? ఇంటికి వెళ్దామంటావా? యింటికి వెళ్లి నాలుగు మెతుకులు తినాలంటే, కట్టెలు కొట్టాలా, అక్కర్లేదా?......నేను రాను నువ్వు వెళితే వెళ్లు" అన్నాడు తండ్రి కోపంగా.

నాగరాజుకు, అడవికి రావటం అదే మొదటిసారి కావటంచేత, యింటికి త్రోవ తెలియదు. చివరికి నాగరాజు వత్తిడిమీద, కోపం తగ్గిపోయాక, వెంకన్న యింటికి బయలుదేరాడు.

* * *

ఇంటికి చేరుకున్నాక, వెంకన్న కొడుకుతో, మొక్కపోయిన గొడ్డలిని అమ్ముకు రమ్మని, ప్రక్కింటి వారికి ముదరా చెల్లించటానికిగాను అతడు మరికొంత సొమ్ము ఎక్కడన్నా సంపాదించవలసి వుంటుందనీ చెప్పాడు.

అందుమీదట నాగరాజు బస్తీకి వెళ్లాడు. అక్కడ బంగారపు పని చేసే కంసాలికి, తన మొక్కపోయిన గొడ్డలిని చూపెట్టాడు. ఆ కంసాలి గొడ్డలిని పరీక్షించి, వెండి అవునో కాదో తేల్చుకున్నాడు. తర్వాత తూనికలో పెట్టి తూచి, "దీని ఖరీదు మూడు వేలు ఉంటుంది. అంత డబ్బు నా వద్ద లేదు" అన్నాడు.

"సరే, మీవద్ద ఎంత ఉంటే అంతే ఇవ్వండి; మిగతాది తర్వాత యిద్దురుగాని" అన్నాడు నాగరాజు.

కంసాలి నాగరాజుకి ఎనిమిది వందల రూపాయలు యిచ్చాడు. మిగతా డబ్బు త్వరలో సర్దుబాటు చేస్తానన్నాడు.

నాగరాజు సంతోషంగా ఇంటికి వచ్చాడు.

"నాన్నా, ప్రక్కింటి వారిని, వాళ్ల గొడ్డలి ఖరీదు ఎంతో కనుక్కోనిరా; వాళ్ళకి ముదరా చెల్లించివేద్దాం" అన్నాడు.

"నాకు తెలుసు - దాని ధర సుమారు నాలుగు రూపాయలుంటుంది" అన్నాడు తండ్రి.

"ఓస్, యింతేనా! అయితే వాళ్లకి ఈ పది రూపాయలు ఇచ్చేసేయ్. ఎందుకనంటే, ఇటు చూడు- నావద్ద కావలసినంత డబ్బు ఉంది" అంటూ నాగరాజు తండ్రికి అయిదు వందల రూపాయలు యిచ్చాడు.

"దీంతో హాయిగా జీవిద్దాం, నాన్నా! నీకింక డబ్బుకొరత లేదు కదూ?" అన్నాడు సంతోషంగా.

"ఆఁ! ఎంత అదృష్టం!...అయితే యింత డబ్బు ఎక్కడ సంపాదించావ్?" అన్నాడు తండ్రి ఆశ్చర్యంగా.

అప్పుడు నాగరాజు, జరిగిన సంగతంతా పూస గుచ్చినట్టు తండ్రికి చెప్పాడు. తన అదృష్టాన్ని నమ్ముకుని, తను ఏవిధంగా సాహసం చేసిందీ, దయ్యం తనకి ఎలా బహుమతి యిచ్చిందీ, అంతా వివరంగా చెప్పాడు. ఇక నాగరాజుతండ్రి ఆనందానికి మేర లేదు.

తర్వాత నాగరాజు, తన మూలిక ప్రభావంవల్ల, ఎంతో వెండిని తయారుచేసి, బోలెడంత ధనం సంపాదించాడు.

కాని ఆడబ్బుతో అతడు, కులాసాగా కాలం గడుపుతూ కూర్చోలేదు. అతడు మళ్ళీ చదువులో ప్రవేశించి, కాలేజిలో మంచి డిగ్రీలు ఎన్నో పొందాడు. డాక్టరుపరీక్ష కూడా ప్యాసయ్యాడు.

తర్వాత కొన్నాళ్లకి, అతడు డాక్టరుగా ప్రాక్టీసు, మొదలుపెట్టాడు. ఎటువంటి వ్రణాలనైనా, ఎంత నయంకాని కురుపులనైనా, యిట్టే మాన్పించగల 'మూలిక' తనవద్ద ఉండటంచేత, అతడు గొప్ప శస్త్రచికిత్సకుడుగా పేరు పొందాడు.

—("గ్రిమ్స్ ఫేరీ టేల్స్"నుండి.)

★